నిరుద్యోగులను ఆదుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో చెప్పిన మాట ప్రకారం వెంటనే నిరుద్యోగ భృతి పథకాన్ని అమలు చేయాలి. కాలయాపన చేయడం వలన రాష్ట్రంలోని నిరుద్యోగులు నష్టపోతున్నారు. ఎలాంటి షరతులు పెట్టకుండా నిరుద్యోగులను గుర్తించి పథకాన్ని అందించాలి. చంద్రబాబు గతంలో మాదిరిగా నిరుద్యోగులను మోసం చేయకుండా నిరుద్యోగులను ఆదుకోవాలి.

– మంచికలపాటి సాల్మన్, నిరుద్యోగి, పొన్నలూరు

అమ్మకు వందనం పథకాన్ని అమలు చేయాలి



ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన విధంగా అమ్మకు వందనం పథకాన్ని అమలు చేసి విద్యార్థుల తల్లి బ్యాంకు ఖాతాలో రూ. 15000 జమ చేయాలి. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్న పథకాన్ని అమలు చేయలేదు. గత ప్రభుత్వంలో ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే తల్లి బ్యాంకు ఖాతాలో అమ్మ ఒడి నగదు జమ చేశారు.

– చుండి సుధ, పొన్నలూరు

ఆశగా ఎదురుచూస్తున్నాం



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం అందరం ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాం. కూటమి నేతలు ఎన్నికలకు ముందు ఎంతో ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా సీఎం గానీ, ఇతర నేతలు గానీ ఇంత వరకు ఆ హామీ గురించి ఏ ఒక్కరూ నోరు మెదపడం లేదు. అసలు ఈ పథకం అమలు చేసే ఉద్దేశం నేతల్లో కనిపించడం లేదు.

– గోనా మరియమ్మ, వీరరాంపురం, హనుమంతునిపాడు మండలం

వ్యవసాయ సీజన్ ప్రారంభం అయింది



గత ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా రైతులకు సంవత్సరానికి 15,000 రూపాయలు ఇచ్చేది. ఎన్నికల హామీల్లో భాగంగా సూపర్ సిక్స్‌లో రైతులకు ప్రతి ఏటా 20,000 రూపాయలు సహాయం చేస్తామని కూటమి నేతలు హామీల వర్షం కుమ్మరించారు. కానీ ఇప్పటికీ ఏమీ చేయలేదు. రైతులకు వ్యవసాయ సీజన్ ప్రారంభం అయింది.

– లక్ష్మీ నరసయ్య, రైతు, పెద్ద కండ్లగుంట, కొండపి మండలం

కాకమ్మ కబుర్లు చెబితే ఊరుకోం



మహిళలకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తానని ఓట్లేయించుకున్నాడు చంద్రబాబు. అధికారంలోకి వచ్చి మూడు నెలలవుతున్నా ఇంత వరకు ఆ ఊసే ఎత్తడం లేదు. ఆ నేతల తీరు చూస్తుంటే ఇప్పట్లో సిలిండర్లు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మళ్లీ మోసం చేయాలని చూస్తున్నారు. ఇది ఏమాత్రం సమంజసం కాదు. మహిళలమందరం సిలిండర్ల కోసం ఎదురుచూస్తున్నాం.

– షేక్ నసీబా, చౌటగోగులపల్లి, పీసీపల్లి

నిన్ను నమ్మం బాబు



చంద్రబాబు నాయుడు, కూటమి ఎన్నికల సమయంలో మహిళలకు మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్నారు. సూపర్ సిక్స్ అని హామీలు ఇచ్చారు. అధికారం లోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత బస్సు ప్రయాణం ఊసే ఎత్తలేదు. మళ్లీ చంద్రబాబుని నమ్మి మహిళలు ఘోరంగా మోసపోయారు. ఇక జీవితంలో నిన్ను నమ్మం బాబు.

– ఇస్తర్ల రాధ, వల్లూరు, టంగుటూరు మండలం



మోసం..బాబు నైజం

- నీటిపై రాతలా మారిన టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు
- బాబుతీరుపై ప్రజలు మండిపాటు
- ప్రభుత్వం కొలువుదీరి 100 రోజులవుతున్నా అతిగతీ లేదు

సాక్షి నెట్‌వర్క్: అన్నదాత సుఖీభవ కాదు, అన్నదాత భవతీ భిక్షాం దేహీ అయింది. తల్లికి వందనం.. అమ్మకు తీరని శోకంలా మారింది. 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు.. ఎడారిలో ఒయాసిస్సులా మారాయి. నిరుద్యోగ భృతి.. ఓ భ్రాంతి అయింది. ప్రతి మహిళకూ ఆర్థిక సాయం.. పిట్టల దొర మాటల్లా దొర్లిపోయింది. ఉచిత బస్సు.. తుస్సుమంది. మొత్తంగా సూపర్ సిక్స్ పథకాలు.. సూపర్ తుస్ మన్నాయి. 'బాబు అంటే మోసానికి బ్రాండ్ అంబాసిడర్. అబద్ధాల రారాజు. మాట మీద నిలబడలేని రాజకీయ నేత.. ప్రజలంటే చులకన భావంతో చూసే పెద్ద మనిషి' అని ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమికి ఓట్లేసిన జనం బాబు తీరుపై మండి పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేదలకు ప్రభుత్వ పథకాలు పెద్ద ఎత్తున చేరాయి. క్యాలెండర్ ప్రకారం ప్రజలకు వెన్నుదన్నుగా నాటి ప్రభుత్వం నిలిచింది. కానీ నేటి బాబు ఏలుబడిలో అన్ని వర్గాలవారు తీవ్రంగా దగా పడినట్లైంది.

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి(రూ.కోట్లలో)
అమ్మఒడి	కొండపి	రూ.44.04
	కనిగిరి	రూ.38.19



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లికి అందాల్సిన సాయం

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

కొండపి - 33,118
కనిగిరి - 40,000
ఇవ్వాల్సిన సాయం - రూ. 109.68(కోట్లు)

జగన్ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందిన సాయం



పథకం	నియోజకవర్గం	లబ్ధి(రూ.కోట్లలో)
రైతు భరోసా	కొండపి	రూ. 55.25
	కనిగిరి	రూ. 52.07

టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాల వారీగా లబ్ధిదారులు

కొండపి - 41,323
కనిగిరి - 49,321
ఇవ్వాల్సిన సాయం - రూ. 181.29 (కోట్లు)



ప్రతి ఇంటికి 3గ్యాస్ సిలిండర్లు

నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

కొండపి నియోజకవర్గం : 76,000
కనిగిరి నియోజకవర్గం : 85,261
మొత్తం లబ్ధిదారులు: 1,61,261
ఇవ్వాల్సిన సిలిండర్లు: 4,83,783



యువతకు నెలకు రూ.3000 నిరుద్యోగ భృతి

నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

కొండపి నియోజకవర్గం : 23,000
కనిగిరి నియోజకవర్గం : 16,500
నెలకు ఇవ్వాల్సిన సాయం : రూ.11.85 కోట్లు



ప్రతి మహిళకు నెలకు రూ.1500

నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

కొండపి నియోజకవర్గం : 1,00,000
కనిగిరి నియోజకవర్గం : 80 వేల మంది
నెలకు ఇవ్వాల్సిన సాయం : రూ.27.00కోట్లు



ఉచిత బస్సు ప్రయాణం కలేనా?

నియోజకవర్గం వారీగా లబ్ధిదారులు

కొండపి నియోజకవర్గం : 1.36 లక్షలు
కనిగిరి నియోజకవర్గం : 1,67 లక్షలు

పెట్టుబడి సాయం ఎప్పుడు..?



గత ప్రభుత్వంలో రైతులకు పంటల పెట్టుబడులకు సీజన్ ముందే రైతులకు సహాయం అందించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని సూపర్‌సిక్స్ హామీ ఇచ్చింది. ఇప్పటికే పంటలు సాగు చేసేందుకు సన్నద్ధమయ్యాం. కానీ ఇంత వరకు ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయలేదు. ఎప్పుడు ఇస్తారో కూడా స్పష్టత లేదు. రైతులకు టీడీపీ ప్రభుత్వం ఇస్తానన్న రూ.20 వేలు వెంటనే చెల్లించాలి.

– యెలికె రమణయ్య, అగ్రహారం, వెలిగండ్ల మండలం

ఎప్పుడు ఇస్తారో అర్థం కావడం లేదు



రైతుకు ఏటా రూ.20 వేలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారు. కానీ ఇంత వరకు ఎప్పుడిస్తారో అర్థం కావడం లేదు. ఇప్పుడిప్పుడే వర్షాలు పడుతున్నాయి. ఈ సమయంలో పెట్టుబడి సాయం కింద ఇస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. గత ప్రభుత్వంలో ఏటా ఠంచన్‌గా రైతు భరోసా అందించారు. టీడీపీ ప్రభుత్వం హామీ నెరవేర్చుకోవాలి.

– కేతు చిన్నపరెడ్డి, చింతలపాలెం, పామూరు మండలం

ఉద్యోగం కల్పించలేకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలి



ఐటీఐ డిప్లమో చదివాను. ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాను. ఎన్నికల ముందు చంద్రబాబు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తానని, లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తానని సూపర్‌సిక్స్ హామీలు ప్రకటించారు. ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్నాను. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ఉద్యోగం లేకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. నా లాంటి ఎందరో నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు.

– కారుమంచి రెడాహుస్సేన్, కంకణంపాడు, వెలిగండ్ల

హామీలు అమలు చేస్తారా..?



టీడీపీ కూటమి ప్రభుత్వంలో 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళలకు నెలకు రూ. 1500ల ఇస్తామని చెప్పి ఇవ్వలేదు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో చేయూత కింద మహిళలకు రూ. 18750, ఈబీసీ నేస్తం కింద ఏడాదికి రూ.15 వేలు చెప్పిన విధంగా మహిళల ఖాతాల్లో జమచేశారు. ఇప్పుడు అసలు ఇస్తారో లేదో? క్లారిటీ లేదు.

– కె. రాణి, మర్రిపూడి

రూ. 1500 ఆర్థిక సహాయం లేదా?



సూపర్ సిక్స్‌లో భాగంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకూ ప్రతి నెలా 1500 రూపాయల ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 50 రోజుల అవుతోంది. వెంటనే ఈ పథకం అమలు పరచి హామీ నెరవేర్చాలి.

– వై.రాజకుమారి, కొండపి

గ్యాస్ సిలిండర్లు ఎక్కడ



ఈ ప్రభుత్వం ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావస్తున్నా నేటికీ గ్యాస్‌సిలిండర్ల ఊసే ఎత్తడం లేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఈ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి.

– ఎస్. వెంకటేశ్వర్లు, కూచిపూడి గ్రామం, మర్రిపూడి మండలం

బ్రహ్మారావును పరామర్శించిన సురేష్



చల్లా బ్రహ్మారావును పరామర్శించిన మాజీ మంత్రి సురేష్

సింగరాయకొండ: మండలంలోని పాతసింగరాయకొండ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు చల్లా బ్రహ్మారావు తల్లి నాగేంద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించింది. దీంతో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం చల్లా బ్రహ్మారావును కలిసి పరామర్శించి నాగేంద్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రహ్మారావుకు, కుటుంబ సభ్యులకు ఆయన ధైర్యం చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యోబు భౌతికకాయానికి దద్దాల నివాళి



నివాళులర్పిస్తున్న దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: మండలంలోని నేలటూరి గొల్లపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుడు ముండ్లపాటి యోబు అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ బుధవారం ముండ్లపాటి యోబు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కటికల వెంకటరత్నం, సర్పంచ్ గోడి నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఐదు రేషన్‌షాపులు ఏర్పాటు

సింగరాయకొండ: మండలంలో అదనంగా 5 కొత్త రేషన్‌షాపులు ఏర్పాటు చేయనున్నట్లు తహసీల్దార్ టి.రవి తెలిపారు. ప్రభుత్వం కొత్త రేషన్‌షాపులకు మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో 400 నుంచి 450 వరకు మాత్రమే ఒక షాపుకు రైస్ కార్డులు ఉండాలన్నారు. మండలంలో సోమరాజుపల్లిలో రెండు, శానంపూడిలో ఒకటి, పాత సింగరాయకొండలో రెండు షాపులు అదనంగా వస్తాయని ఆయన వివరించారు.

20, 21 తేదీల్లో అండర్ 14, 17 సెలక్షన్స్

కొండపి (సింగరాయకొండ): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 20, 21 తేదీల్లో అండర్-14, అండర్ 17 సెలక్షన్స్ కె.ఉప్పలపాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో జరుగుతాయని ఎంఈఓ సురేఖ తెలిపారు. 20న బాలురకు, 21న బాలికలకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బాడ్మింటన్, చెస్, యోగా, అథ్లెటిక్స్ విభాగాల్లో సెలక్షన్స్ కం టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు.

ప్రభుత్వ నిర్ణయంతో కార్మికులకు ఇక్కట్లు

పామూరు: కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో ఇసుక కొరత ఏర్పడి పనులు లేక భవన నిర్మాణ కార్మికులు పస్తులుంటున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి అన్నారు. స్థానిక వైఎస్సార్ సెంటర్‌లో బుధవారం సాయంత్రం ప్రభుత్వ ఇసుక విధానంపై నిరసన చేపట్టారు. ప్రభుత్వం ఇసుక సరఫరాకు తీసుకున్న నిర్ణయంతో ఇసుక కొరత ఏర్పడిందన్నారు. ఉచిత ఇసుక అని చెబుతున్నా గత ప్రభుత్వం కంటే ఇప్పుడే అధిక ధర పలుకుతోందన్నారు. తక్షణం ఇసుక సరఫరా సరళీకృతంపై నిర్ణయం తీసుకోవాలని లేకుంటే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేసి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామన్నారు.

విఘ్నేశ్వరుడికి ఆదిమూలపు పూజలు



కందులూరు విఘ్నేశ్వరుడి వద్ద పూజలు చేస్తున్న ఆదిమూలపు సురేష్

టంగుటూరు: మండలంలోని కందులూరు గ్రామంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి వద్ద మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానంలో సురేష్ పాల్గొన్నారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొట్ల రామారావు, బొట్ల సుబ్బారావు, బొట్ల మాల్యాద్రి, తొట్టెంపూడి సురేష్, మల్లవరపు కోటిరెడ్డి, మల్లవరపు రమణారెడ్డి, గోను కోటేశ్వరరావు, బొడ్డు వేణు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ సంబరాలు జయప్రదం చేయండి

పామూరు: చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలని జేవీవీ జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ తిరివీధి చెన్నకృష్ణ అన్నారు. స్థానిక వైద్యశాలలో బుధవారం చెకుముకి సైన్స్ సంబరాల గోడ పత్రికను ఆవిష్కరించారు. నాయకులు వి.మాలకొండారెడ్డి, జవంగుళ వెంకట్రావు, పేట తిరుపతిరెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్.అబ్దుల్, కాశె శంకర్, షేక్.ఫయాజ్ పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా పోటీలు

హనుమంతునిపాడు: మండలస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహించనున్నట్లు ఎంఈఓ జి.పెద్దిరాజు, పీడీ షేక్ జలానీలు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, షటిల్, యోగా, చెస్, అథ్లెటిక్స్‌లో పోటీలు జరుగుతాయన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

కనిగిరి రూరల్: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని కంచర్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 28నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచి ప్రాంతంలో జరగనున్న 36వ జాతీయస్థాయి సబ్ జూనియర్ బాల, బాలికల ఖోఖో టోర్నమెంట్ పోటీలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా నుంచి కంచర్లవారిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు బాలికల విభాగంలో సంగటి భాను ప్రియ బాలుర విభాగంలో కొర్ల వెంకట సాయి ఎంపికైనట్లు పీడీల సంఘం జిల్లా కార్యదర్శి బి. కాశీ విశ్వనాథ రెడ్డి తెలిపారు.

వైభవంగా నరసింహ స్వామి పవిత్రోత్సవాలు



నరశింహస్వామి ప్రత్యేక అలంకరణ

సింగరాయకొండ: మండలంలోని పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు బుధవారం మూడవ రోజు ఘనంగా జరిగాయి. స్వామికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించేందుకు అభిషేక పూజా సామగ్రి, పవిత్రాలను వేద పండితులు మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపు సాగింది. తరువాత స్వామికి అభిషేక పూజలు నిర్వహించి పవిత్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. 19వ తేదీ గురువారం జరిగే కార్యక్రమంతో పవిత్రోత్సవాలు పూర్తవుతాయని ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట లక్ష్మీనరసింహాచార్యులు వివరించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

సీఎస్‌పురం(పామూరు): ఉత్తమ విద్యా బోధనతోనే ఉపాధ్యాయులు అవార్డులు సొంతం చేసుకున్నారని ఎంఈఓ జె.ప్రసాదరావు అన్నారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం తోట శ్రీనివాసులు అధ్యక్షత జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్న సునీతాదేవి, ఇ.సరోజనమ్మలను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం ఉపాధ్యాయులకు మాత్రమే ఉంటుందన్నారు. జిల్లా కార్యదర్శి షేక్.నాయబ్‌రసూల్, ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ టి.రాజ్‌కుమార్, జోన్ నాయకులు దండే శ్రీనివాసులు, కేవీ సుబ్బయ్య, జీఎస్ ఆనంద్‌బాబు, మాలకొండయ్య పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై శిక్షణ

కనిగిరి రూరల్: ప్రథమ చికిత్సపై పారిశుధ్య కార్మికులు అవగాహన కల్గి ఉండాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక మున్సిపాలిటీ సమావేశ మందిరంలో బుధవారం పారిశుధ్య కార్మికులు ప్రథమ చికిత్సపై శిక్షణ, అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రదీప్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, మెప్మా సీఎంఎం రఘు, శానిటరీ కార్యదర్శి రమణారెడ్డి, పవన్, రాజశేఖర్ పాల్గొన్నారు. తొలుత స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించి 2కే రన్‌లో కమిషనర్ డానియల్ జోసఫ్, చైర్మన్ గఫార్ పాల్గొన్నారు.